# డోలారోహణ

అది కార్తికమాసము. ఉదయము ఏడుగంటలయింది. స్నానసంధ్యాదులు ముగించుకొని-రాత్రి తీసుకున్న పాలతోటి కాఫీ చేసుకొని త్రాగి తనయిద్దరు కొడుకులకు మూసిపెట్టి, చావడిలో ఉయ్యాల బల్లమీద కూర్చుని, అప్పుడే వచ్చిన పత్రిక మడత విప్పుతున్నాడు పద్మనాభరావు.

ఆయనకు ఏభయి సంవత్సరాలు సమీపించినవేమో, ఒకనల్లటి వెంట్రుకయినా లేని క్రాపు; ఖద్దరు వస్త్రాలు ధరించిన సుమారయిన విగ్రహము ఆయనది. సంపాదకీయము చూసిన తరువాతగాని మరొకటి చదవటం అలవాటు లేకపోవటం వల్ల, పత్రిక మడత విప్పటమే మధ్యభాగానికి విడదీసి తనకనుకూలముగా కుదుచుకుంటున్నాడు.

సరిగా ఆ సమయానికే ప్రక్కఇంట్లోనుంచి గ్లాసు ఎత్తి పడవేసిన చప్పుడు వినిపించింది.

“అబ్బా! తెల్లవారిందీ వీళ్ళగోలకు” అనుకుంటూ పత్రిక అక్కడ పడవేసి, తమభాగానికీ అవతల భాగానికీ నడుమఉన్న తలుపుదగ్గర నిలబడ్డాడు.

“ఇన్ని ఏళ్ళయింది. కాఫీ చేయటమయినా రాకపోతే ఎట్లా? మగవాళ్ళు చేసుకుంటారు! ఎవరింటికిపోయినా ఎంతో ముచ్చటగా ఉంటుంది. మన యింటి కాఫీ ఉడుకునీళ్ళలా ఉంటుంది ఎప్పుడూను. ఏమిటి మనగతి?”

“.... .... .... .... .... .... .... .... ....”

“నేను మాటవరుస కడుగుతున్నాను. గింజలోపమా, వేపుడు లోపమా, దేని దంటావు!”

“ఏమో.... మరి”

''కుంటిజవాబు కాదు నేను కోరేది. అసలు మనయింటి కాఫీ తత్వమూ దాని కారణమూను నేను కోరేది.''

ఒక్కొక్కమాట ములికిలాగ నిర్దేశించినచోట సూటిగా వెళ్ళి తాకుతున్నది.

''ఏదయితే నేమి? మీరు కాఫీగ్లాసు విసిరి పారవేయటమూ, ఆ చప్పుడు నలుగురి చెవిని పడటమూ అయిన తరువాత.''

కొరడాదెబ్బలాగ ఆమాట పద్మనాభరావు ఎదలో తాకింది. వెంటనే ఉయ్యాల బల్ల దగ్గరకి వచ్చి, తిరిగి తన పేపరువిప్పి చదువుకోవాలని చూశాడు. కాని సాగలేదు. తన మనసుకు సూటిగా తాకిన ఆ మాటనుగురించే ఆలోచనలు పోతున్నాయి. తాను తలుపుదగ్గర నిలబడి వాళ్ళను గమనించటము ఆమె కని పెట్టింది కాబోలు! పాప మామెకెంత అభిమానము కలిగిందో-తాను వాళ్ళ వివాదాలు వింటున్నాడని! తనకయినా ''రోజూ ఈయన పుల్లవిరిచినట్లుగా కటువుగా మాట్లాడుతాడు భార్యతోటి; ఈవేళ దేనిమీదనుంచి వచ్చిందో'' అన్న సామాన్యమైన కౌతుకంతోనే గాని వేరు దృష్టితో కాదు వాళ్ళను గమనించింది! పాపము ఆమె మనసెంత నొచ్చుకున్నదో? మగవాళ్ళు చప్పున రెండు మాటలనివేసి బయట పడతారు. ఆడవాళ్ళకెన్నో బాధలు, అనిపించుకొన్న కష్టమొకటి, అంటూఉండగా ఎవరయినా విన్నారని తెలిసినతరువాత కలిగే అభిమానమొకటీను.

ఇట్లా గుణించుకుంటూ ఉండగా, నాన్నా! కాఫీలో చక్కెర వేశావా? నేను వేసుకోనా?'' అని కొడుకు అడిగాడు.

''నేను వెయ్యలేదురా.'' డబ్బా అక్కడేఉంచి వేసుకో! అని అన్నాడే గాని, నిజంగా వేశాడో లేదో ఆయనకే జ్ఞాపకములేదు. ఒకరు చేసినపనిని విమర్శించే అధికారము ఇంకొకరికి ఉన్నంతవరకు ప్రతి చిన్నపొరబాటూ, సామాన్య విషయమూ కొండంతగా కనబడుతుంది. అరగంట క్రిందటి పొరుగింటి వివాదము ఇటువంటిదేనేమో! అక్కడ చేసేదొకరు, అనే దొకరు. తమదగ్గర చేసేది తాను-కాని అనే అధికారము మరొకరికి లేదు. కనుక హెచ్చుతగ్గులన్నీ పొరబాట్లుగా కనబడుతున్నాయి. అయినా పొరుగింటాయన కాస్త నిదానము నేర్చుకుంటే సుఖపడతాడు అని పద్మనాభరావు అనుకున్నాడు.

భార్య చనిపోయిన తరువాత పద్మనాభరావు నిజమైన విశ్రాంతిని కోరాడు. పదిహేను, పన్నెండు సంవత్సరాల ఈడుగల యిద్దరు కొడుకులను, పదిహేను సంవత్సరాలు కలిసి జీవించిన భర్తను, పదలి శాశ్వతంగా దివి నలంకరించింది. నాలుగేళ్లనాడు అంబుజమ్మ-పద్మనాభరావు సహధర్మచారిణి.

ఊరు మారిస్తే సగము దిగులు విచారము తగ్గుతుందన్న భావనతో కొడుకు లిద్దరిని చేతబట్టుకొని-ఇంకా సర్వీసు ఉన్నప్పటికి-పెన్షనుకొరకు దరఖాస్తు పెట్టి-పట్టణము చేరాడు భూవసతివల్ల వచ్చే సంవత్సరాదాయముతోటి, పెన్షనుతోటి, గడచిపోతున్నది జీవితము. తాను ఇన్ని సంవత్సరాల ఉద్యోగములో ఒక్క కాని అయినా నిలువ చేయలేకపోయినా పిత్రార్జితము వ్యయపరచలేదు. పాలకొల్లు నరసాపురము ప్రాంతంలోఉన్న అంటుమామిడితోట-బాగా విలువకలది-అమ్మి పట్న వాసపు కాపురానికి సుమారైన ఇల్లు కొని ఒక భాగంలో తాను తన పిల్లలు ఉంటూ అవతల భాగము అద్దెకిచ్చాడు. అదేమిటో-ఈ కాలానికి ఎంతటి ఆదాయము చాల నట్లే కనబడుతుంది. ఇటీవల ఒక దినపత్రికకు, ఒక వారపత్రికకు ముఖ్యమైన వ్యాసాలు, సంపాదకీయము వ్రాసిఇచ్చే ఏర్పాటు చేసుకున్నాడు. చాలవరకూ గ్రంథ కాలక్షేపమే ఆయన దినచర్య.

* * * *

ఆయన తన భార్యతో గడపిన జీవితములో మూడువంతులు చాలా సామాన్యంగా-నిర్లక్ష్యముతో కాకపోయినా-ఎక్కువ గమనిక లేకుండానే గడిపాడు. ఒకటి తరువాత రెండు, రెండు తరువాత మూడు.... పునరపి రజనీ పునరపి దివసం.... అన్నట్లుగా కాలకృత్యాలు తీర్చుకొని ఆఫీసుపని చేసుకోవటము, తిరిగి కాలకృత్యాలు, భోజనము, నిద్ర.

కొంతకాలము ఉద్యోగము చేశాడు. భార్యతో వైవాహిక జీవితము గడిపాడు-పిల్లలు పుట్టారు-పెరిగారు-కాలము గడచిపోయింది! అంతే. ప్రకృతి సౌందర్యోపాసనతో-రసాస్వాదనముతో ...ఎందులో ఏముందో తొంగి చూడాలన్న కాంక్షలేకుండా గడపివేశాడు.... యాంత్రిక జీవితమువలె! అదేమిటో.... తలుచుకుంటే ఆయనకే ఆశ్చర్యము!

ఆరోజు ఆఫీసుకు సెలవు. కచేరీ కాగితాలు చూసుకుంటూ గదిలో కూర్చు న్నాడు. అప్పుడు ఆకుపచ్చటి కాశ్మీరు శాలువ చెవులమీదుగా తలకు చుట్టుకొని

మకర కుండలాలు చెవులకు, దర్భముడి ఉంగరము వేలికి ధరించి పండితోచ్చా రణతో శంకరాచార్యులవారి భజగోవింద శ్లోకాలు హిందోళరాగంలో చదువుతూ-ఏభయి సంవత్సరాల బ్రహ్మతేజస్వి చరచర నడుచుకొంటూ నేరుగా ఆఫీసు గది లోకి వెళ్లి సుభమస్తు' అన్నాడు. ఆ పరమేశ్వరుడిలాగా ఎకాఎకి గదిలోకి వచ్చిన పండితునిచూసి, నమస్కారముచేసి. కూర్చోమని మర్యాదచేశాడు పద్మనాభరావు.

"మీ జన్మనక్షత్రము, సంవత్సరము నాకు చెప్పండి. మీ వ్రాతపని పూర్తి అయేవరకు గుణించి ఫలితాలను వ్రాస్తాను. హిమాలయ పర్వతము మొదలుకొని కన్యాకుమారి వరకు పెద్దల జాతకాలన్నీ పరిశీలించాను. మీదికూడా చూడాలని కుతూహలపడుతున్నాను" అన్నాడు పండితుడు

"ఏమోనండీ! నాకు జాతకము చూపించుకోవటములో ఎక్కువ నమ్మ కమూ ఉత్సాహమూ లేదు. దానికేమి గాని మీరు తాంబూలము తీసుకోండి." అంటూ ప్రక్కగదిలోకి వెళ్ళి అయిదు రూపాయల కాగితము తాంబూలములో పెట్టి తీసుకొనివచ్చి ముందర పెట్టాడు.

ఆయన తీసుకోకుండానే బలవంతంమీద నక్షత్రము సంవత్సరము తెలుసు కొని, బయట వరండాలో బల్లమీద కూర్చుని గుణిస్తూ మధ్యమధ్య పద్మనాభరావు ముఖము, ఆకారము, అవయవశోభ తిలకిస్తూఉన్నాడు. మరో గంటకల్లా తిరిగి ఆఫీసుగదిలోకి వెళ్ళి, "చూడండి, మీకు నేను ఒక సంవత్సరము వరకు ఫలితా లను తెలుపుతూ ఒక పట్టిక వ్రాశాను. నేను జాతకాలను లెక్కలేనన్ని చూస్తూ వృద్ధుడనవుతున్నాను. కాని ఈ జాతకుడి కళత్రమువంటి ఇల్లాండ్రను మాత్రము వ్రేళ్ళమీద లెక్కించవలసిందే. ఆహా ఏమి ఇల్లాలండీ! తాటస్థ్యంగా-నిర్వి కారంతో-చూసీ చూడపట్లుగా కాపురము చేస్తున్న భర్తకొరకు-ఆ యింటికీ-దానికి సంబంధించిన మర్యాదకు ఎంతగా పాటుపడే యిల్లాలయ్యా! మనసులో ఉండగానే అన్నీ సమకూరుస్తూ, తనకు ప్రాముఖ్యము గమనిక ఇవ్వని భర్తకొరకు ఈ రోజులలో ఎవరు ప్రాకులాడుతారు? మీరు గ్రహించి విలువ యివ్వలేకుండా ఉన్నారు. కాని మంచి అదృష్టవంతులు. పోయి వస్తాను" అంటూ తాంబూలము తీసుకొని వెళ్ళిపోయాడు.

అదే ప్రారంభము అంబుజమ్మ అదృష్టరేఖ బయట పడటానికి. అప్పటి నుంచి ఆమెకు ఉచ్ఛదశ ప్రారంభమయింది.

అదేమిటో-జగత్తులో సూర్యచంద్రాదుల ఉదయాస్తమయాలను పరిగణించే సామాన్యదృష్టితో భార్యనూ, ప్రపంచాన్ని చూసే పద్మనాభరావుకు మరుసటిదినము లగాయతు వింతకలలే! ప్రకృతి శోభాయమానంగానూ, భార్య అనురాగమయిగాను కనబడసాగినది. అప్పటినుంచీ అంబుజమ్మ మాటలో ఉనికిలో అనురాగము తొణికిసలాడుతున్నట్లుగాను, పాకరుచులలో నల భీములను మరపిస్తున్నట్లుగాను, మాట నచ్చచెప్పటములో మంత్రిపుంగవులను మించుతున్నట్లుగాను తోచిందాయనకు.

తన భార్య ఏమికాదు! శాపదగ్ధయై భూలోకంలో అవతరించి నిద్రితుడైన తనను ఈ ప్రకృతిలో మేల్కొలపటానికై ఏతెంచిన అచ్చర!

పదమూడేండ్లుగా ఎండి బీటలువారిన ఆమె హృదయక్షేత్రానికి-ఆయనలో కలిగిన మార్పు తొలకరి చినుకు అయింది.

ఆయనకు అప్పుడు-ఆమెతో కూడాకూడా తిరగటానికి విసుగు జనించలేదు. పైగా సంతోషంగాను, ఉత్సాహంగాను ఉంది. ఆమె కాఫీ తయారుచేసేఅంతలో ఆయన గ్లాసులు సర్దటము, భోజనములయిన తరువాత ఆమె తలుపులు వేసే అంతలో ఆయన తాంబూలము తయారుచేయటము.... ఇష్టాగోష్ఠితో.... చిలకాగోరువంక లయ్యారు.

తాను సృష్టించిన ప్రకృతిని దానిశోభను దైవమే చూడలేడు! యౌవనపు ఒడుదొడుకులు లేకుండా-ఒకరినొకరు అర్థముచేసుకొని-తమ జీవితాలను రసమయం చేసుకుంటూ ఉండగా-జ్యోతిని చూపించిన దేవుడే జ్యోతిని మాయముచేశాడు.

ఇప్పుడాయన సాహచర్యం గ్రంథాలతోను, ప్రశాంతమైన జీవనముతోను.

* * * * *

ఆనాడు ఉగాది. విరోధినామసంవత్సరము ప్రవేశించింది. మన పండుగలు వస్తూనే ఇళ్లనూ, దేహాలను శుద్ధిపరుస్తాయి. పండుగ అల్లంత దూరాన ఉండగానే బూజుదులిపి, ఇళ్ళను శుభ్రంగా కడిగి ముగ్గులువేసి, ఆకర్షణీయంగా చేస్తారు. ప్రతివాళ్ళు అభ్యంగన స్నానాలు చేస్తారు.

ఏడు గంటలయేసరికి అందరిఇళ్ళలోను స్నానాలుచేయటము వేపప్రసాదము తీసుకోవటమూ జరిగింది.

అవతలి భాగంలోఉన్న దశరథరామయ్యగారు ఇంకా నిద్రలోనే ఉన్నారు. ఆయన గృహము తీర్చిదిద్దిన రంగవల్లులతో పండుగ నాహ్వానించింది.

ఏడు దాటినా ఆయన నిద్రలేవకుండా గురకలు పెట్టున్నాడు. పాపమామె ఇంట్లోకీ పెరట్లోకీ తిరుగుతున్నది. ఆయన నిద్రలేచి-అభ్యంగనమాడి-వేపప్రసాదముతో కాఫీ తీసుకొని-అవతలికి వెళ్ళాక వంట ఆరంభము చెయ్యాలనికాబోలు!

* * * * *

పద్మనాభరావు ఇంట్లో ఆడవాళ్ళు లేకపోయినా పండుగలను సక్రమంగావే ఆహ్వానిస్తున్నాడు. కొన్నిపనులు స్వయంగా చేసుకొంటూను, కొన్ని పనులు చేయించుకుంటూను, 'నామమాత్రంగా నయినా పండుగ చేయకపోతే ఎట్లా' అనుకుంటూ జరుపుతూనే ఉన్నాడు. మగసంసారమని ఎంత క్లిష్టముచేసినా... పాకరుచు లెరిగిన జిహ్వ ఆయనది! భార్య బ్రతికిఉన్న కాలములో భక్ష్యాలు చేయించుకొని ఆరగించినవ్యక్తి గనుక ఇప్పుడు కనీసము పూరీలయినా చేసుకోవాలని అనుకుంటూ కాలము నెట్టుకొస్తున్నాడు, భార్యపోయిన నాలుగు సంవత్సరాలనుంచి.

మధ్యాహ్నము భోజనాలు కాగానే పద్మనాభరావు ఒక నిద్రపోయి లేచాడు. మంచినీళ్ల త్రాగి లవంగమొకటి నోట్లో వేసుకొని తనచేతికి వచ్చిన పుస్తకమొకటి బల్లమీదనుంచి తీసుకొని తెరిచాడు.

కేచి దజ్ఞానతో నష్టాః-కేచి న్నష్టాః ప్రమాదతః
కేచిత్ జ్ఞానావలేపేన-కేచిన్నష్టై ర్వినాశితాః

అని చదువుతూ ఉండగా,

"ఏమయినా సరే మన యిద్దరికీ ఈ ఇంట్లో పొసగదు. ఇంత మాటనిర్లక్ష్యమయితే ఎట్లా?" అంటున్నాడు దశరథరామయ్య. అయనదగ్గర ఒక గుణమున్నట్లున్నది. ఆయన ఎంత గట్టిగా అరుస్తాడో అంతగట్టిగాను అరుస్తూ జవాబిస్తే తాను

అడిగినదానికి సమాధానమని ఎంచుకోవటము; నిదానంగా-తగవు చంపుతూ మాట్లాడితే నిర్లక్ష్యమని నాసికాగ్రానికి ఎక్కిన కోపముతో చిందులు త్రొక్కటము ఆయనకు అలవాటు.

ఆమెదగ్గర తగవును చంపబోతున్నట్లుగా మాట్లాడే స్వభావ మున్నట్లున్నది. "నేనేమి వ్యతిరేకంగా నడిచాననీ ఈ రగడ అంతాను" అనుకుంటూ అక్కడ నిలబడకుండా అవతలికి వెళ్ళినట్లున్నది.

"నీకు నిర్లక్ష్యము లేకపోతే ఇక్కడ నిలబడి ఎందుకు మాట్లాడవు?" అని ఆయన వెన్నంటిపోయి గద్దిస్తున్నాడు.

"పండుగపూట ఏమిటా గొడవ? ఈ జన్మఅంతా ఇలాగే విరసంగా గడచేటట్లున్నది. ఈ వయసులో మీకూ నాకూ పొసగకపోవటమేమిటి? పెద్దమనుష్యుల సమక్షంలో-ముగ్గురు పిల్లల ఎదుట రోజూ నన్ను ఈ వేపుకొని తినట మేమిటి? మనమిద్దరికి ఇక కాపురము పొసగదు అనుకొన్ననాడు చడీచప్పుడు లేకుండా, వేరే ఉందాము లెండి. అరవకండి" అంటోంది గృహిణి గద్గద స్వరంతో.

ఈ రభసలో పద్మనాభరావు గ్రంథపఠనము సాగలేదు. అదిగాక-భార్యావియోగమైన దగ్గర్నుంచీ-ఏ ఇల్లాలయినా దుఃఖిస్తుంటే ఆయన చూడలేడు. పైగా గతించిన తన జీవితంలోని దుస్స్వప్నమే జ్ఞాపకమొచ్చి-తనభార్య కన్నీళ్ళతో, నిరాశా హృదయంతో కృశించి పోతున్నట్లుగా కళ్ళకు కనబడి-ఆయన ఒక రకంగా మానసికమైన బాధకు గురిఅయ్యేవాడు ప్రశాంతమును కోరే తన జీవితసంధ్యలో తీరని ఆవేదనలు కలిగిస్తున్నారు ఆ దశరథరామయ్య దంపతులు.

"అక్కడికి నీవు మహా మర్యాదస్థురాలివీను నేను యాగీ చేసేవాణ్నీ కదూ నీ దృష్టిలో!" అంటూ సాధిస్తున్నాడు ప్రక్కయింటాయన, భార్యను.

ఇక వినలేక పోయినాడు పద్మనాభరావు. ఒంటినిండా చీమలు పారినట్లయింది. శతకోటి ఆవేదనలతో, అనంతకోటి వ్యథలతో మంచముమీదనుండి లేచాడు. ఇక దుర్భరము! ఒక నిముషమైనా తానుండలేడు ఆ ఇంట్లో! తన అరికాళ్ళక్రింద నిప్పులు పోస్తున్నదా మిధునము.

"దశరథరామయ్యగారూ! దశరథరామయ్యగారూ!" అంటూ లేచివెళ్లి తలుపుకొట్టాడు. తలుపులు దగ్గరిగా వేసి ఉండటమువల్ల 'రండి లోపలికి' అని లోపల ఉన్నవాళ్ళు అవగానే వెళ్ళాడు. ఆమె ఆప్రాంతాలలో లేకుండా లోపలికి వెళ్లిపోయినట్లుంది, ఆయన మాత్రము ఏమీ ఎరగనట్లే పేపరు చదువుకుంటూ ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"దయచేయండి. ఈ కుర్చీలో కూర్చోండి" అని పద్మనాభరావుకు కుర్చీ చూపించి, "అన్నగారికి పండగ ఫలహారము తీసుకురావే" అంటూ గోడతో చెప్పినట్లుగా-జడపదార్థాన్ని సంబోధించినట్లుగా కేకవేశాడు.

"క్షమించండి నేను మీకు అన్నగారిని కాను. మీ భార్యకు అన్నగారిని అవుదామని ఇన్నాళ్ళనుంచీ తీసుకోని చనవును ఇప్పుడు తీసుకొంటున్నాను. ఒక పదినిమిషాలపాటు మీ ఇద్దరూ మా ఇంటికి రావాలి" అన్నాడు అభ్యర్థిలాగ.

"మీరు ముందు మా ఇంట్లో ఫలహారము చేయాలి. నామాట మన్నించరూ బావగారూ" అన్నాడు దశరథరామయ్య. "ఇంత మర్యాదస్థుడు లలిత హృదయుడూ ఎందుకట్లా కటువుగా మాట్లాడుతూ ఇంటిలో భార్యను నలిపి చంపుతున్నాడు! ఏమిటబ్బా యీయన ప్రకృతి!" అనుకుంటూ కుశల ప్రశ్నలతో ఫలహారము ముగించి తన ఇంటికి వాళ్ళిద్దరిని తీసుకొనివెళ్ళి ఉయ్యాలబల్లమీద కూర్చోబెట్టి పద్మనాభరావు లోపలికి వెళ్ళాడు.

తాముపెట్టిన ఫలహారానికి బదులుగా ఆయనచేసిన పిండివంటకాలు ఏదో తెచ్చి ముందర పెట్తాడు కాబోలు ననుకుంటున్నారు దంపతులు. చీరె రవికెలబట్ట ఒకవైపు, ధోవతులచాపు తాంబూలాలు మరొకవైపు, ఒక పళ్ళెంలో పెట్టి వాళ్ళ కెదురుగా నిలబడ్డాడు, వాళ్ళిద్దరికీ ఇదేమీ అర్థముకాక తెల్లబోయి చూస్తున్నారు.

"నేను ప్రతియేటా మా చెల్లెలికి బావమరిదికి బట్టలిస్తాను. వాళ్లు ఈ సంవత్సరము రాలేదు. ఈ సంవత్సరాది శుభదినాన మీ దంపతులిద్దరిని చెల్లెలు-బావమరిది వరుస చేసుకుంటున్నాను. బావమరిది హక్కుతో నేనొకటి మీ యిద్దరిని ప్రార్థిస్తాను. కటువుగా-విరసంగా-మీరు జీవితాలను గడపటము ఆరు నెలలనుంచీ నేను చూడలేకుండా ఉన్నాను. ప్రతి నిమిషమూ విలువగలదనీ, గడచినది తిరిగి

రాదనీ, రేపటితో మన జీవితము సరేనేమో అంతవరకూ ఆనందంగా ఉందామనీ నా సమక్షంలో స్థిరము చేసుకోండి'' అంటూ బట్టలు వాళ్ళ ముందరపెట్టి ఉయ్యాల బల్ల గొలుసును ముందుకు లాగి బలంగా వెనక్కు తోశాడు.

ఆ ఊపులో ఊపిరి సలుపక, ''అవునా! మనమట్లా ప్రవర్తిస్తున్నామా? పాపమాయనకు ఎంత కష్టమనిపించిందో చూశావా?'' అని కళ్ళతోటే ఒకరినొకరు ప్రశ్నించుకున్నారు దంపతులు.

ఆ డోలారోహణే వాళ్ళ శేషించిన జీవితానికి 'తొలుత బ్రహ్మాండంబు తొట్టె గావించి, నాలుగు వేదాల గొలుసు లమరించి' అనే జోలపాటయింది. ఊగుతూనే చేతులు జోడించారు ఇద్దరూ.